అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
గురువారం 02 మార్చి 2023

పర్వతారోహణ శిక్షణలో బీసీ విద్యార్థులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాక్ క్లైమ్బింగ్ స్కూల్ భువనగిరి వారు నిర్వహించిన రెండు రోజుల ట్రైనింగ్ క్యాంపులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి కోటాపై రాక్ క్లైమ్బింగ్ ట్రైనింగ్ ప్రోగ్రాంక జిల్లాకేంద్రంలోని పోస్ట్ మెట్రిక్ వసతిగృహ విద్యార్థినీ విద్యార్థులు హాజరై పర్వతారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పర్వతారోహణకు సంబంధించి అనేక అంశాలను శిక్షకుల వద్ద నేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసి సంక్షేమ శాఖ అధికారులు ఏసుమని, నిక్కతరణం, ప్రసాద్, మధుకర్ పాల్గొన్నారు.



మసీదుల అభివృద్ధిపై కేసీఆర్ ప్రత్యేక దృష్టి :ఎమ్మెల్యే రేఖా నాయక్

ఖానాపూర్ రూరల్ : తెలంగాణ రాష్ట్రంలో మైనార్టీల అభివృద్ధి కోసం కేసీఆర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. బుధవారం ఆమె క్యాంపు కార్యాలయంలో మండల కేంద్రంలోని మసీదుల అభివృద్ధికి విడుదల చేసిన రూ.10లక్షల చెక్కును ముస్లిం పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పట్టణంలోని మసీదుల మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనుల కోసం ఈ నిధులను వెచ్చించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ముస్లిం మత పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోహిద్, మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్, మత పెద్దలు డాక్టర్ కేహెచ్ ఖాన్, కైసర్, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాలను ఎత్తేసే యోచన విరమించుకోవాలి

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మె ప్రారంభం





కాగజ్‌నగర్‌లో..

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అంగన్‌వాడీ కేంద్రాలను ఎత్తివేసే యోచనను కేంద్రం విరమించుకోవాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ త్రివేణి డిమాండ్ చేశారు. బుధవారం అంగన్‌వాడీ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా కాగజ్‌నగర్‌లో సమ్మె చేపట్టి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా త్రివేణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను ఎత్తివేసే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో భారీగా నిధుల కోత విధించిందని అన్నారు. ప్రజలకు విస్తృత సేవలందించే అంగన్‌వాడీ వ్యవస్థను పటిష్ట పరచాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని అన్నారు. వేధింపులు ఆపాలని, పని ఒత్తిడి తగ్గించాలని, సంబంధం లేని పనులు అప్పగించరాదని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ప్రమోద్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు ఎం వినోద, వై అరుణ, నాయకులు కుమారి, రజిత, రమ, విజయ, జయమండల్, సరస్వతి, ప్రమీల, మల్లేశ్వరి, జ్యోతి పాల్గొన్నారు.

దహెగాం : ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేస్తే ఊరుకునేది లేదని సీఐటీయూ మండల కన్వీనర్ వజ్రమ్మ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ మధుకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నూతన విద్యాచట్టం వల్ల అంగన్‌వాడీ సెంటర్లను ఎత్తివేయాలని ఆలోచన చేస్తుందని, వెంటనే అలాంటి ఆలోచనలను విరమించుకోవాలన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిధులు తగ్గించడం అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి పన్నిన కుట్ర అని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జయప్రద, మల్లీశ్వరి, జ్యోతి, పద్మ, మమత పాల్గొన్నారు.

జైనూర్ : అంగన్‌వాడీ యూనియన్ మండలాధ్యక్షురాలు మెస్రం కమలాబాయి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సమీర్ హైమద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు.

బెజ్జూర్ : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ శ్రీపాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కృష్ణమాచారి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఖానాపూర్ రూరల్ : అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం సీడీపీవో సరితకు వినతిపత్రం అందజేశారు. మొదట కార్యాలయం ముందు ప్ల కార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడారు. అంగన్వాడీ, మినీ అంగన్వాడీ హెల్పర్లకు పెంచిన వేతనాలు వెంటనే ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

భైంసా : ముధోల్ ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట బుధవారం తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ హెల్పర్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధ్యక్షురాలు రజీయ బేగం మాట్లాడుతూ మూడు రోజుల పాటు సమ్మె నిర్వహించనున్నట్లు తెలిపారు. పిఆర్సి ఎరియర్స్ 2021 జులై, అక్టోబర్, నవంబర్ నెలలవి వెంటనే చెల్లించాలని, ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మదర్స్ కమిటీలకు చైర్మెన్‌గా తల్లులను మాత్రమే నియమించాలని, గ్రామ సర్పంచులను చైర్మన్‌లు నియమించరాదని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు స్వర్ణలత, రేఖ, కవిత, తానూర్, బాసర, ముధోల్ మండలాల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉట్నూర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన నూతన లేబర్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఐటీడీఏ కార్యాలయం ముందు సీఐటీయు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటీయు జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి పొట్టకొట్టే చట్టాలను తీసుకురావడం సరికాదన్నారు. ఐసీడీఎస్‌ను బలోపేతం చేసేందుకు బడ్జెట్ పెంచాలని, సంస్థకు నష్టం కల్గించే నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలోని అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించి, టీచర్లతో సమానంగా అంగన్వాడీ ఉద్యోగులకు వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. 2017 నుండి రావాల్సిన టీఏ, డీఏ బకాయిలు మొత్తం చెల్లించాలన్నారు. నూతన పీఆర్సీ ప్రకారం మూడు నెలల ఎరియర్స్ చెల్లించాలని, ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, ఎలాంటి షరతులు లేకుండా మినీ అంగన్వాడీ సెంటర్లంటినీ మెయిన్ సెంటర్లుగా గుర్తించాలని, అంగన్వాడీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ ఉద్యోగులకు ఆసరా, కళ్యాణలక్ష్మి తదితర ప్రభుత్వ సంక్షేమ పథాకలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో అంగన్వాడీ సంఘ నాయకులు ముక్తా, రత్నమాల, సుభద్ర, పద్మ, సువర్ణ, లత, భగీర్త, నర్మద, భారతి, పార్వతి పాల్గొన్నారు

నార్నూర్ : అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీలు మూడు రోజుల సమ్మెను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు సుభద్ర మాట్లాడుతూ తమిళనాడు, పాండిచేరి రాష్ట్రాల్లో అక్కడి రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిందన్నారు. తమిళనాడు, కర్ణాటకలో హెల్త్ కార్డులు ఇచ్చిందన్నారు. పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాల్లో అంగన్వాడీ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, పండగ బోనస్ తదితర సౌకర్యాలు కల్పిస్తుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం అంగన్వాడీలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ప్రగతిభవన్ సమావేశంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు పంచశీల, సీఐటీయూ జిల్లా నాయకులు సురేందర్, జిల్లా కమిటీ సభ్యులు మల్లు, పంచపూల, సురేఖ, రాధ, పంచశీల, ప్రమీల, సురేఖ పాల్గొన్నారు.



దహెగాంలో..



ఉట్నూర్‌లో..



ఖానాపూర్‌లో..

విద్యుత్ ఉద్యోగుల ధర్నా



నవతెలంగాణ-కాగజ్‌నగర్

వేతన సవరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఉద్యోగులు బుధవారం భోజన విరామ సమయంలో ధర్నా చేపట్టారు. స్థానిక ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయం ముందు చేపట్టిన ఈ ధర్నాను ఉద్దేశించి జేఏసీ నాయకులు మాట్లాడుతూ 2022, మార్చి 31తో వేతన సవరణ గడువు ముగిసినా ఇప్పటికీ యాజమాన్యం వేతన సవరణ చేపట్టకుండా కాలయాపన చేస్తోందని అన్నారు. వేతన సవరణ చేపట్టేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా కో కన్వీనర్ ఎమ్మాజి సతీష్, నాయకులు రాజశేఖర్, శ్రీనివాస్, సంతోష్, చంద్రశేఖర్, రామకృష్ణ, ప్రతాప్, విశ్వనాథ్, సుధారాణి పాల్గొన్నారు.

ఆలయాలు ధ్వంసం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ - బెజ్జూర్

మండలంలో ఆలయాలను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని అందుగులగూడ గ్రామ సర్పంచ్ కొమురం హనుమంతు ఆధ్వర్యంలో గ్రామస్తులు మల్లన్న గుట్ట వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఆలయాలు ధ్వంసం చేసి నిప్పంటించిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ సంఘాలు ఈ నిరసనకు మద్దతు పలికాయి. ఎస్ఐ వెంకటేశ్ సంఘటన స్థలానికి చేరుకొని దుండగులను పట్టుకుంటామని హామీ ఇచ్చారు. ఆలయాలకు రక్షణ కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు సిడాం సకారాం, కోర్తె తిరుపతి, రమేష్, ఏనక శ్రీహరి, బానయ్య పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం లక్ష్యం చేరుకోవాలి



నవతెలంగాణ-భీంపూర్

భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకొని ఆ దిశగా లక్ష్యాలను సాధించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి, 6,9,10వ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యా బోధన, రివిజన్ వంటివి చేస్తూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి భోజనం అందించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక రివిజన్ తరగతుల నేపథ్యంలో అల్పాహారం అందించాలని తెలిపారు. ప్రీ ఫైనల్ పరీక్ష అనంతరం ఆయా పరీక్షకు సంబంధించిన ప్రశ్నలలో ఏమైన అనుమానాలు ఉంటే నివృత్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి ఉదయశ్రీ, ప్రత్యేక అధికారిణి రజనీ పాల్గొన్నారు.

సహకార శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సహకార శాఖ నాన్ గజిటెడ్ అధికారుల సంఘం జిల్లా డైరీని బుధవారం సహకార కార్యాలయంలో జిల్లా సహకార అధికారి జి శ్రీనివాస్‌రావు, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సంద అశోక్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిసిఓ మాట్లాడుతూ సహకార శాఖ ఉద్యోగుల డైరీ ఉద్యోగులకు ఎంతో ఉపయోగపడే విధంగా ఉందన్నారు. జీవోస్, యాక్ట్, సమాచారం పొందుపరిచారని కొనియాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్, కార్యదర్శి విక్రాంత్, ఆడిట్ ఆఫీసర్ రాథోడ్ బిక్కు, సూపరింటెండెంట్ ముజఫర్ హుస్సేన్, ఆత్మరామ్, ఉద్యోగులు కళ, అరుణ, ధీరేష్, నరేష్, సంజయ్, శశికళ, రజిత, కృష్ణవేణి, అమ్రేష్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పర్యవేక్షించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్ పరిధిలలోని వార్డుల్లో నిర్వహించే పారిశుధ్య కార్యక్రమాలపై జవాన్‌లు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పి.ఎస్ అన్నారు. బుధవారం పట్టణంలోని వార్డ్ నెంబర్ 16,17,18,19లో పారిశుధ్య కార్యక్రమాల పనితీరును మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పర్యవేక్షించారు. కాలనీలలో మురికి కాలువల నుండి తీసే చెత్త, ఇసుక, తదితర వ్యర్థాలను వెంటనే తొలగించాలని, రోడ్లపై, చౌరస్తా, ముఖ్య కూడళ్లలో ఉన్న ఇసుకను తొలగించాలని అన్నారు. నాళీలలో చెత్తను వేయకుండా గృహ యజమానులకు, కాలనీ వాసులకు వివరించాలని తెలిపారు. నీటి నిల్వ ఉండకుండా నాలాలలో నీరు ప్రవహించే విధంగా చూడాలని తెలిపారు. జవాన్‌ల పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడనే ఉంటుందన్నారు. ఇకముందు జవాన్‌ల పనితీరు సరిగా లేనట్లయితే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. కాలనీలలో నాళాలపై ఉన్న స్లాబ్‌లు విరిగిపోవడం, చెడి పోవడం వలన కాలనీ వాసులు, వాహనదారులకు ఇబ్బంది కలుగుతోందని ఆ ప్రాంతవాసులు కలెక్టర్‌కు వివరించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఇంజనీరింగ్ అధికారులు సత్వర చర్యలు చేపట్టాలన్నారు.



ఇంటింటి చెత్త సేకరణ చేపట్టడం ద్వారా నాళాలలో చెత్త వేయకుండా ఉంటారని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా కాలనీలలో నీటి సరఫరా జరిగే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. సుందరయ్యనగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని చెత్తను తొలగించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ శైలజ, డిప్యూటీ ఈఈలు తిరుపతి, మొహమ్మద్ యూనిస్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్ ఉన్నారు.

కుమ్మరులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

నవతెలంగాణ - బెజ్జూర్

కుమ్మరులు వృత్తిపరమైన శిక్షణ పొంది వృత్తిని గ్రామాల్లో విస్తరించాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. మండలంలోని బారెగూడెం గ్రామంలో వారం రోజులుగా శాలివాహన కుమ్మరి జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. బుధవారం శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడారు. శాలివాహన కుమ్మరులకు వృత్తిపరమైన శిక్షణ ఇవ్వడం జరిగిందని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ పొందిన వారికి సబ్సిడీ రుణాలు అందజేస్తామని తెలిపారు. గ్రామాల్లో కుండలు తయారు చేసే వారికి కర్ర మట్టి ఉచితంగా సప్లయి చేస్తామని హామీ ఇచ్చారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో కుమ్మరుల కోసం ప్రత్యేకంగా భవనం ఏర్పాటు చేస్తామన్నారు. వంద మిషన్లతో పాటు ఆధునిక యంత్రాలను ఉచితంగా అందజేస్తామన్నారు. 250 యూనిట్లు కరెంటు ఉచితంగా అందజేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కుండలు అమ్మడానికి స్థలాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సత్యనారాయణ, టూరిజం అధికారి రామకృష్ణ, జిల్లా సమాఖ్య అధ్యక్షుడు మల్లేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు రాబట్టాలి



నవతెలంగాణ-తాండూర్

విద్యార్థులు కష్టపడి చదివి పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు రాబట్టాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం మండలంలోని జ్యోతిబాపూలే పాఠశాలను సందర్శించి పదవ తరగతి విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపారు. పదవ తరగతి పరీక్షలు విద్యార్థులు భవిష్యత్తును నిర్ధారిస్తాయని తెలిపారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం జ్యోతిబాపూలే వంటి గురుకులాలను ఏర్పాటు చేసిందన్నారు. ఉపాధ్యాయులు శ్రమించి మంచి ఫలితాలను రాబట్టాలని తెలిపారు. ఆయన వెంట వైస్ ప్రిన్సిపాల్ కావేరి, టీచర్లు విజయేందర్, ప్రశాంత ఉన్నారు

విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీయడానికే సైన్స్‌ఫేర్

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు



నవతెలంగాణ - జైనూర్

విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడం కోసం సైన్స్‌ఫేర్ ఉపయోగపడుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్లోబల్ పాఠశాలలో సైన్స్‌ఫేర్ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను పరిశీలించారు. సైన్స్ విద్యబోధిస్తున్న ఉపాధ్యాయుడు చౌహాన్ ఉపేందర్‌కు అతిథులతో కలిసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి గ్రంథాలయ సంస్థ చైర్మన్ పూలమాలలు వేసి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్‌ఫేర్‌లో భాగంగా విద్యార్థులు తమలో ఉన్న ఆలోచనలకు రూపకల్పన చేస్తూ వివిధ రకాల మోడల్స్ తయారు చేశారని తెలిపారు. విద్యార్థులు రేన్ డిటెక్టర్, యాక్సిడెంట్, వాటర్‌హీటర్, వాటర్ ప్యూరిఫైర్, వాటర్ సైకిల్, బయోగ్యాస్, సోలార్, త్రీడీ వాటర్ లాంటి అనేక ప్రాజెక్టులను తయారుచేసి అతిథులకు చూపించడం గర్వకారణమన్నారు. అనంతరం అతిథులకు పాఠశాల యజమాని షేక్ నాజీం శాలువాలు కప్పి మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అబూతాలిబ్, పోషకాలు కమిటీ ఉపాధ్యక్షుడు ముత్తె పవార్, అజయ్, ఆదివాసీ సంఘం నాయకులు నీలకంఠ్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యూరింగ్‌ను పట్టించుకోని కాంట్రాక్టర్

నవతెలంగాణ-దస్తురాబాద్

మండల కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో రూ.30లక్షలతో నిర్మించిన భోజనశాల భవనానికి కాంట్రాక్టర్ క్యూరింగ్ చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గుత్తేదారు ఫిబ్రవరి 7న భోజనశాలకు స్లాబ్ వేసి నీరు మాత్రం పోయడం లేదు. ఈ విషయాన్ని సదరు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఇష్టారీతిన మాట్లాడాడని పేర్కొంటున్నారు. చేసేది లేక పాఠశాల వాచ్‌మెన్‌తో ఉపాధ్యాయులు భవనానికి నీరు పట్టిస్తున్నారు. నూతన భోజనశాల నిర్మాణానికి అడ్డు వస్తుందని రూ.10లక్షల విలువ చేసే ప్రహారీ గోడను కూల్చేశారు. బాలికల ఆశ్రమ పాఠశాల కావడం, ఊరి చివరన ఉండటంతో విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు. ప్రహారీ గోడ కూల్చివేయడంతో పాఠశాలలో కుక్కలు, పందులు, కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. మరోవైపు భోజనశాలను ఆనుకొని మరుగుదొడ్లు నిర్మించడంతో వ్యాధులు ప్రబలే అవకాశముందని గ్రామస్తులు పేర్కొన్నారు. దీనిపై జేఈ ప్రశాంత్‌రెడ్డిని ఫోన్‌లో వివరణ కోరగా క్యూరింగ్ జరుగుతోందని చెప్పారు. సదరు కాంట్రాక్టర్‌ను, సూపర్‌వైజర్‌ను సంప్రదిస్తే మీరెవరు మమ్మల్ని అడగడానికి అని ఇష్టారీతిన మాట్లాడారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అటవీ సంరక్షణపై అవగాహన

జన్నారం : కవ్వాల్ టైగర్‌జోన్ బాసర సర్కిల్ పరిధిలోని అటవీ సంరక్షణపై అటవీశాఖ అధికారులతో బుధవారం బాసర సర్కిల్ కన్జర్వేటర్ శర్వానంద్, ఎఫ్‌డీఓ వినోద్‌కుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండల కేంద్రంలోని టీడీసి సెంటర్లో బాసర సర్కిల్‌లోని వివిధ రేంజ్‌లకు చెందిన ఎఫ్ఆర్‌వోలు, ఎఫ్ఎస్ఓలతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వేసవికాలం సమీపిస్తున్న దృష్ట్యా అడవిలో ఉన్న జంతువులకు నీటి సౌకర్యం కల్పించాలన్నారు. అగ్నిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.



అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
గురువారం 02 మార్చి 2023

ఖబ్రస్థాన్ ఏర్పాటుకు భూమి కేటాయించాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని బాబాపూర్ గ్రామంలో ముస్లిం సంఘం ఆధ్వర్యంలో ఖబ్రస్థాన్ నిర్మాణానికి భూమి కేటాయించాలని బుధవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. రూ.5 లక్షల నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందేలా చర్యలు తీస్కుంటా తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీవిద్య, మాజీ ఎంపీపీ తునికి రాజేశ్వర్, శివాలయ కమిటీ చైర్మన్ సురేష్ రెడ్డి, నసీర్, ముస్తఫా, షేక్ అలీ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొంది, ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు బుధవారం నూతన యూనిఫాం పంపిణీ చేశారు. కళాశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ జగ్‌రాం అంతర్వేది ఆధ్వర్యంలో యూనిఫామ్‌లు అందజేశారు. దేశ సేవ చేసేందుకు ఎన్‌సీసీ ఒక మార్గం అని ప్రిన్సిపాల్ అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాస్, రఘునాథ్, ప్రతాప్ సింగ్, ఆర్ సంతోష్ కుమార్, కే రమేశ్, డా.నర్సింగరావు, దయాకర్ తిరుపతి, సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

పీఆర్సీ ప్రకటించకుంటే ఉద్యమం తప్పదు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యుత్ ఉద్యోగులకు ప్రకటించాల్సిన పీఆర్సీ వెంటనే ప్రకటించాలని లేకపోతే ఉద్యమం తప్పదని విద్యుత్ ఉద్యోగ సంఘం జేఏసీ నాయకులు అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసనలో భాగంగా జిల్లా కేంద్రంలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంతర విద్యుత్ కోసం తాము ఎంతగానో కృషి చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం తమ సేవలు గుర్తించి తమకు రావాల్సిన పీఆర్సీని వెంటనే అమలు చేయాలన్నారు. పీఆర్సీ అమలు కాలం దాటి సంవత్సరం పూర్తయినప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పీఆర్సీ ప్రకటించాలని లేనియెడ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ వాసుదేవ్, డీఈ ప్రసాద్, ఏడీఈలు శ్రీనివాస్, కార్యాలయ ఏఓ రవికుమార్, ఏఈలు ప్రేమ్ కుమార్, రవీందర్, జేఏసీ నాయకులు మారుతి, మహేందర్, నరేష్, నజీరుద్దీన్, వనిత, సునీత, ఆశ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేత

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే7 గనిలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ధార నాగేశ్వరరావు కరోనాతో మరణించగా అతని కుటుంబానికి రూ.15 లక్షల చెక్కును బుధవారం గ్రూప్ ఏజెంట్ సత్యనారాయణ, గన్ మేనేజర్ సాయిప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గనిలో పనిచేసే కార్మికులకు, ఉద్యోగులకు ప్రమాదం జరిగినప్పుడు వారి కుటుంబ సభ్యులకు యాజమాన్యం అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి శాంతన్, ఆఫీస్ ఇబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పనులు సమర్థవంతంగా నిర్వహించాలి



నవతెలంగాణ-తాండూర్

పంచాయతీ కార్యదర్శులు నర్సరీ పనులను సమర్థవంతంగా నిర్వర్తించాలని తాండూర్ ఎంపీఓ నారాయణ సూచించారు. బుధవారం మండలంలోని నర్సాపూర్ పంచాయతీలోని నర్సరీని సందర్శించి పంచాయతీ సెక్రెటరీ సాదుల్లాకు పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని నర్సరీ పనులను సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు. మొలకలకు ప్రతి రోజు రెండుసార్లు నీరు అందించాలన్నారు. మొలకలురాని బ్యాగుల స్థానంలో రీ ప్లాంటేషన్ చేయాలన్నారు. పెరిగిన మొక్కల మధ్య కలుపును ఎప్పటికప్పుడు తీసివేయాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున నర్సరీలపై షెడ్ నెట్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఆర్థిక పునరావాస పథకానికి దరఖాస్తు స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని వికలాంగులైన స్త్రీ, పురుషుల నుండి ఆర్థిక పునరావాస పథకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు వికలాంగుల సంక్షేమ శాఖ జిల్లా అధికారిని సావిత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు 19 యూనిట్లు మంజూరు అయ్యాయని దీని కోసం రూ.22 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వికలాంగులు ఆన్‌లైన్‌లో టీఎస్‌ఓబీఎంఎంఎస్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా ఈనెల 6 లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలు ఆన్ లైన్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు.

4న ఆదిలాబాద్‌కు బండి సంజయ్ రాక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఈ నెల 4 జిల్లా కేంద్రానికి రానున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శకంర్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ప్రజగోసా బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా నాయకులను కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడేందుకు జిల్లాకు వస్తున్నారని తెలిపారు. ముందుగా మావల బై పాస్ స్వాగత ద్వారం నుంచి బైక్ ర్యాలీగా దస్నాపూర్‌లోని జనార్దన్‌రెడ్డి గార్డెన్ వరకు వస్తారని తెలిపారు. అనంతరం గార్డెన్‌లో పలువురు ప్రముఖులు బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరనున్నారని తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా నాయకులు లాలా మున్న, దినేష్ మటోలియ, లోకా ప్రవీణ్ రెడ్డి, జోగు రవి, ఆకుల ప్రవీణ్, రత్నాకర్‌రెడ్డి, విజయ్, మయూర్ చంద్ర, వేద వ్యాస్, రాము, సురేష్ ఉన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్



అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఐసీడీఎస్ కార్యాలయం ముందర ధర్నా నిర్వహించారు. అనంతరం సీడీపీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి.వెంకటమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు పనిచేస్తున్నారని వాళ్ళు బడుగు, బలహీన వర్గాల చెందిన వారు, మహిళలు అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. వారు గత 40 సంవత్సరాలకు పైగా ఐసీడీఎస్‌లో విధులు నిర్వహిస్తూ పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. అటువంటి వారికి కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత వంటి చట్టబద్ధ సౌకర్యాలు ఏవి ప్రభుత్వం కల్పించకపోవడం శోచయమన్నారు. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, పాండిచ్చేరి ప్రభుత్వాలు అక్కడి అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని గుర్తు చేశారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రంలో అయితే అంగన్‌వాడీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు కూడా మంజూరు చేశారని వివరించారు. పశ్చిమబెంగాల్ కేరళ వంటి రాష్ట్రాల్లో రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెన్షన్ పండగ బోనస్ సౌకర్యాలు కూడా కల్పిస్తున్నాయని అన్నారు. మన రాష్ట్రంలో మాత్రం ఎలాంటి సౌకర్యాలకు అంగన్‌వాడీ ఉద్యోగులు నోచుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. అంగన్వాడి ఉద్యోగులకు ప్రగతి భవన్ వేదికగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల గ్రాట్యుటీ చట్టం 1972ను సుప్రీంకోర్టు ఆదేశానుసారం వెంటనే వర్తింప చేయాలన్నారు. 2017 నుండి టీఏ, డీఏ, ఇంక్రిమెంట్, ఇన్‌ఛార్జి అలవెన్సు ప్రభుత్వం చెల్లించడం లేదని 2018లో కేంద్ర ప్రభుత్వం పెంచిన వేతనం రాష్ట్ర ప్రభుత్వం ఇంకా చెల్లించకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి రాష్ట్రంలోని అంగన్‌వాడీ ఉద్యోగులకు గ్రాట్యూటీ చెల్లించి వేతనంలో సగం పెన్షన్‌గా నిర్ణయించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు కళావతి, పద్మ, పార్వతి, సిఐటియు ఉపాధ్యక్షురాలు డి .సునీత, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ .నవీన్ కుమార్ పాల్గొన్నారు.

వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేకపోతే చర్యలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

- నిబంధనలు పాటించని నాలుగు వాహనాలు సీజ్



ట్రాఫిక్ నిబంధనల ప్రకారం నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని డీఎస్పీ ఉమేందర్ అన్నారు. బుధవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ పురుషోత్తం, ట్రాఫిక్ సీఐ అశోక్‌తో కలిసి ట్రాఫిక్ నిబంధనలపై పలు వివరాలను వెల్లడించారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కొంతమంది నెంబర్ ప్లేట్లు లేకుండా ట్యాంపరింగ్ చేస్తున్నారని అన్నారు. అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బుధవారం తాంసి బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టగా తప్పుడు నంబర్ ప్లేట్ వాహనం ఒకటి, ముగ్గురు తమ వాహనాలకు రిజిస్ట్రేషన్ లేకుండా పట్టుబడినట్లు తెలిపారు. వీరిపై కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీస్కుంటామని తెలిపారు. ప్రతిఒక్కరూ వాహనానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. లేనట్లయితే జరిమానాలతోపాటు కేసులు సైతం నమోదు చేస్తామని హెచ్చరించారు.

వాహనదారులు పన్నులు సకాలంలో చెల్లించాలి

- జిల్లా రవాణాశాఖ అధికారిని గంధం లక్ష్మి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో సరుకు రవాణా చేస్తున్న రవాణా వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన పన్నులను సకాలంలో చెల్లించాలని జిల్లా రవాణాశాఖ అధికారిని గంధం లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత ఫిబ్రవరి 1 నుండి పనుల చెల్లింపు కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి 31తో ప్రత్యేక డ్రైవ్ ముగుస్తుందన్నారు. దీనిని జిల్లాలోని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాహనాలు తనిఖీల్లో పట్టుబడితే 200 శాతం పన్ను విధించడం జరుగుతుందని అపరాధ రుసుము వసూలు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికీ జిల్లాలో 172 కేసులు నమోదు చేసినట్లు రూ.15.36 లక్షలు వసూలు చేసినట్లు వివరించారు. జిల్లాలో 2701 వాహనాలు పన్నులు చెల్లించకుండా తిరుగుతున్నట్లు గుర్తించామన్నారు. సరుకు రవాణాలో సరైన పత్రాలు లేనట్లయితే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కొంతమంది యువకులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్నారని అలా చేయడం సరైనది కాదని, ప్రతి ఒక్క యువకుడు లైసెన్స్ తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని అలా ఇస్తే వారిపై కేసులు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ సంతోష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-ఉట్నూర్

సైబర్ నేరాలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్సై భరత్ సుమన్ అన్నారు. బుధవారం స్థానిక కేబీ కాంప్లెక్స్‌లో మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్‌లకు వచ్చే మెస్సేజ్‌లకు అనవసర లింక్ లకు స్పందించవద్దన్నారు. సైబర్ నేరగాళ్ళు కొత్త కొత్తగా ఆలోచిస్తు డబ్బులు వసూలు చేయలని దూరాశతో ఫోన్‌లకు మెసేజ్‌లు, వాట్సప్‌ల ద్వారా లింకులు పంపిస్తున్నారని వాటిని ఎట్టి పరిస్థితి ల్లో ఓపెన్ చేయవద్దని సూచించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కాకుండా బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దన్నారు. బాగా చుదువుకొని ఉన్నతమైన స్థానానికి ఎదిగి తల్లిదండ్రుల ఆశయాలను నిలబెట్టాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాణోత్ హరిత, వైస్ ప్రిన్సిపాల్ గంగామణి, అధ్యాపకులు సాయిలత, గణేష్, సుధారాణి. సుగుణ, ఎల్లవ్వ శ్రావణి పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రానికి చెందిన వెంకన్న(57) అనే వ్యక్తి ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ బుధవారం తన ఇంటి సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వెంకన్న గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రెండు కాళ్ళ పనిచేయక పోవటంతోపాటు భార్య కూడా అనారోగ్యంతో మంచానికి పరిమితమైంది. ఆరోగ్య సమస్యలతో మనస్తాపం చెంది ఆరు బయట ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉండగా పెద్ద కుమారుడు ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్ళాడు. చిన్న కుమారుడు సొంత గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. మృతుడి భార్య పిర్యాదు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ సంస్థను లాభాల బాట పట్టించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆర్టీసీ సంస్థను లాభాల్లో తీసుకురావడానికి కార్మికులు, అధికారులు కషి చేయాలని కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం అదిలాబాద్ ఆర్టీసీ డిపోను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కల్పన పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆర్టీసీ ద్వారా కల్పిస్తున్న సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సంస్థ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఆయన వెంట ఆర్టీసీ ఆర్ఎం జనీరెడ్డి ఉన్నారు.

గోదావరి వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు



నవతెలంగాణ-బాసర

గోదావరి నది తీరంలో ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్ నియమించిన బృందం సభ్యులు బుధవారం ఆలయంలోని వేములవాడ అతిథి గహంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు గోదావరి నది తీరం ఘాట్‌ల వద్ద బ్రిడ్జి పైన కంచే ఏర్పాటు విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం కమిటీ సభ్యులు గోదావరి నది తీరం వద్ద ప్రమాదాలు చోటుచేసుకునే ప్రదేశాలను, నది తీరంలో స్నానల కోసం లోపలికి వెళ్లకుండా ఇనుప జాలీలు, ప్రత్యేకంగా మహిళల కోసం డ్రెస్సింగ్ రూమ్ ఏర్పాటుకు, భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యల విషయాలను జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డికి నివేదికను సమర్పించనున్నట్లు బృందం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో విజయరామారావు, తాహసీల్దార్ నారాయణ, ఎస్సై మహేష్, ఇరిగేషన్ శాఖ ఏఈ రమేష్, సుభాష్, ఆర్ అండ్ బీ డీఈ సుభాష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి



నవతెలంగాణ-జన్నారం

వహన దారులు తప్పక ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎంవీఐ జాదవ్ యోగేశ్వర్ సూచించారు. బుధవారం మండలం కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద ప్రధాన రహదారిపై స్థానిక ఎస్సై పి.సతీష్‌తో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేని ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు వారు తెలిపారు. వాహనదారులు అన్ని రకాల ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. ప్రతి వాహనదారుడు తప్పక, హెల్మెట్, లైసెన్స్, ఆర్సీలు, ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. వాహనాలు అతివేగంగా నడపటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నరు. అనంతరం చింతలపల్లి గ్రామానికి చెందిన దాసరి తరుణ్‌కు జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సీఓఈ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-తాండూర్

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించిన జేఈఈ మెయిన్స్ బీఆర్క్ ఫలితాల్లో బెల్లంపల్లి సీఓఈ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపల్ ఐనాల సైదులు తెలిపారు. జనవరిలో జరిగిన జేఈఈ మెయిన్స్ బీఆర్క్ పరీక్షా ఫలితాలను బుధవారం వెల్లడించారు. ఈ ఫలితాల్లో బెల్లంపల్లి సిఓఈ విద్యార్థులు పొట్టాల విష్ణు 97.8 పర్సంటైల్ అల్లూరి శివప్రసాద్ 95.5 పర్సెంటైల్ సాధించి జాతీయస్థాయిలో సత్తా చాటారని తెలిపారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రాజకుమార్, దాసం అజిత, నాగిని, శ్రీరాంవర్మ, మిట్ట రమేష్, చందా లక్ష్మీ, నారాయణ, సురేష్‌గౌడ్, కట్ల రవీందర్, సుంకరి అర్జున్ పాల్గొన్నారు

బాబ్లీ ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

నవతెలంగాణ-బాసర

మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లను బుధవారం కేంద్ర జల వనరుల సంఘం సభ్యుడు ఎన్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇరు రాష్ట్రాలకు చెందిన ఇరిగేషన్ అధికారుల సమక్షంలో బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తి 0.6 టీఎంసీల నీటిని ఎస్సారెస్పీలోకి వదిలారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు త్రాగు నీటి అవసరాల కోసం మార్చ్ 1న గేట్లను ఎత్తి నీటిని వదిలినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మహారాష్ట్ర ఇరిగేషన్ శాఖ అధికారులు చౌగలే, ఎస్సారెస్పీ ఈఈ చక్రపాణి, ఏఈ వంశీ పాల్గొన్నారు

బీజేపీ మండల కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీజేపీ మండల అధ్యక్షుడు ఇదులవాడ గణేష్ ఆధ్వర్యంలో బుధవారం మండల కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా ఉపాధ్యక్షుడు ఖండ్రే విశాల్, జిల్లా సీనియర్ నాయకులు సప్త శ్రీనివాస్, దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మటూరి జయరాజ్ పాల్గొన్నారు. మండల ఉపాధ్యక్షులుగా జంజీరాల కిరణ్, బొమ్మెన నరేష్, బోయిరె శ్రీకాంత్, సంగ్డే సురేష్, మండల ప్రధాన కార్యదర్శిగా దుడిసే వినోద్, రత్నం, రవీందర్, కార్యదర్శులుగా చాప్లే ప్రసాద్, సప్తే రమేష్, సభ్యులుగా ఇగురపు రాజు, బీజేవైఎం మండల అధ్యక్షులు లోనరే మోహన్, బీసీ మోర్చా మండల అధ్యక్షులుగా పసునూరి సాయి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులుగా అంకాంత్ రావు, బీజేవైఎం ఉపాధ్యక్షులుగా కూరత్కర్ నాగరాజు, చాప్లే ప్రసాద్, చునార్కర్ పవన్ కుమార్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులుగా లోకండే రాజేందర్ ఎన్నికైనట్లు ప్రకటించారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రాజెక్టు అధ్యక్షురాలు ఉమా మాట్లాడుతూ గత 40 ఏండ్ల నుండి ఐసీడీఎస్ పరిధిలో అంగన్‌వాడీ వర్కర్లుగా పనిచేస్తున్నామని, ప్రభుత్వం మాకు కనీసం గౌరవించడంలేదని, గతంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అనేక ఉద్యమాలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షురాలు విమల, కార్యదర్శి అర్చన, చంద్రకళ, మీరాబాయి పాల్గొన్నారు.

నూతన వధువుకు చీరె సారె

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని పౌనూర్ గ్రామానికి చెందిన పెనుకుల ఈశ్వరి-సదయ్య దంపతుల కుమార్తె వివాహానికి స్థానిక జడ్పీటీసీ మేడి సునిత తిరుపతి నూతన వస్త్రాలతో పాటు ఆర్థిక తోడ్పాటు అందించారు. బుధవారం స్థానిక సర్పంచ్ సారయ్య, మాజీ సర్పంచ్ వెంకటస్వామితో కలిసి సదయ్య ఇంటికి వెళ్లిన జడ్పీటీసీ నూతన వధువును కలిసి వివాహ కానుకగా బాల్క ఫౌండేషన్ ద్వార చీరె సారె అందిస్తున్నట్లు తెలిపారు.

గ్రామపంచాయతీ పనుల పరిశీలన

నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని కల్లంపల్లి గ్రామ పంచాయతీని మండల పంచాయతి అధికారి శ్రీపతి బాపురావు బుధవారం మొబైల్ ఆప్ ద్వారా తనిఖీ చేశారు. ప్రతి రోజు ఉదయం ఏడు గంటలకు విధులకు హాజరై శానిటేషన్ పనులను విస్తృతంగా చేపట్టి, డైలీ శానిటేషన్ రిపోర్ట్‌ను మొబైల్ ఆప్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి రోజు ట్రాక్టర్ ద్వారా చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి చెత్తను వేరు చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అల్లూరి లక్ష్మయ్య, సర్పంచ్ కుస్రమ్ పద్మ పంచాయితి కార్యదర్శి సుదర్శన్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు సన్మానం

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 గనిలో బుధవారం పదవి విరమణ పొందిన కార్మికులను గని మేనేజర్ సాయి ప్రసాద్ ఘనంగా సన్మానించారు. అలాగే పదవి విరమణ పొందుతున్న కార్మికులకు సర్వీస్ బెనిఫిట్ చెక్కులను అందించారు. అనంతరం మేనేజర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో వివిధ కేటగిరీలో 30 నుండి 40 సంవత్సరాల సర్వీసులో విధులు నిర్వహించి సింగరేణి సంస్థకు వారు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో రక్షణ అధికారి రవి శంకర్, అండర్ మేనేజర్లు రవీందర్, వెంకట్ రామ్, రవి తేజ, బాల కృష్ణ, ఇంజనీర్ రమేష్, సంక్షేమ అధికారి శాంతన్, వెంటిలేషన్ ఆఫీసర్ జగదీశ్వర్ రావు పాల్గొన్నారు.

వేలంపాటకు విస్తృత ప్రచారం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజీవ్ స్వగృహ ఇళ్ల స్థలాల బహిరంగ వేలం పాటకు ఏర్పాట్లు చేపట్టాలని, విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పి.ఎస్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం నవంబర్ మాసంలో నిర్వహించిన స్వగృహ ప్లాట్ల వేలం పాటలో కొంత మంది డబ్బులు సకాలంలో చెల్లించలేదని, ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరిగి బహిరంగ వేలం వేయడానికి నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. వేలంపాటపై అవగాహన, అనుమానాల నివృత్తికి 10న ప్రీ బిడ్ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. మిగిలిపోయిన 58 ప్లాట్లకు ఈ నెల 17న బహిరంగ వేలం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

పీహెచ్‌సీలు మంజూరు చేయాలని మంత్రికి వినతి

నవతెలంగాణ-బోథ్

నియోజకవర్గంలో మరికొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరు చేయాలని బుధవారం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావుకు వినతిపత్రం అందజేశారు. బోథ్‌లోని సాయినగర్, సిరికొండ మండల కేంద్రంలో ఆరోగ్య కేంద్రాలు మంజూరు చేయాలని కోరారు. ఆశా వర్కర్ల పోస్టులు సైతం మంజూరు చేయాలని, తాంసి మండలానికి 108 వాహనం ఏర్పాటు చేయాలని కోరారు. బోథ్ మండల కేంద్రంలోని 30 పడకల ఆసుపత్రిని 100 పడకలకు ఉన్నతీకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత

నవతెలంగాణ-కడెం

బీఆర్ఎస్ సభ్యత్వం పొంది ప్రమాదవశాత్తు మరణించిన మండలంలోని ఉడుంపూర్ గ్రామానికి చెందిన గైక్వాడ్ శశిపాల్ కుటుంబానికి బుధవారం ఎమ్మెల్యే రేఖానాయక్ రూ.2లక్షల బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కార్యకర్తను కోల్పోవడం అంటే కుటుంబ సభ్యున్ని కోల్పోవడం లాంటిదని తెలిపారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. అనంతరం అల్లంపెల్లి గ్రామానికి చెందిన కార్యకర్త నర్సింహరెడ్డి పిల్లల పేరుపై డిపాజిట్ చేసిన రూ.50వేల డిపాజిట్ పేపర్స్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, వైస్ ఎంపీపీ కట్ట శ్యాంసుందర్, జెడ్పి కోఆప్షన్ మెంబర్ ఎండి రఫిక్ పాల్గొన్నారు.

పెంచిన ఎంట్రన్స్ టెస్టు ఫీజులు తగ్గించాలి

నవతెలంగాణ-మంచిర్యాల టౌన్

ఎంట్రెన్స్ టెస్ట్ ఫీజులను తగ్గించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు జారీ చేసిన ఎంట్రన్స్ నోటిఫికేషన్లలో దరఖాస్తు ఫీజులను గత సంవత్సరం కంటే రూ.100 ఎక్కువగా పెంచారని, దీనివల్లన పేద విద్యార్థులు ఒక్కటి కంటే ఏక్కువ సెట్లకు దరఖాస్తు చేసే అవకాశం లేకుండా పోతుందని పేర్కొన్నారు. ఈ ఫీజుల రూపంలో రూ.కోట్లు విద్యార్థుల నుండి వసూళ్లు చేస్తున్న మళ్ళీ ఫీజులు ఉన్నతవిద్యామండలి పోందుతుందని తెలిపారు. నిధులు లేవు అని ఫీజులు పెంచే మండలి ఏలా రూ.10 కోట్లు సీఎం సహాయనిధికి ఇచ్చారని ఎస్ఎఫ్ఐ ప్రశ్నిస్తున్నట్లు పేర్కొన్నారు. తక్షణమే పెంచిన ఎంట్రన్స్ ఫీజులను తగ్గించాలని పేద విద్యార్థులను ఉన్నత విద్యకు వెళ్ళేలాగా ప్రోత్సహించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుందని తెలిపారు.

జోడేఘాట్ గిరిజనులకు పక్కా ఇండ్లు నిర్మించాలి

నవతెలంగాణ-కెరమెరి

జోడేఘాట్ గిరిజనులకు శాశ్వత గృహాలు నిర్మించి ఇవ్వాలని తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గరిపెల్లి కరుణగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం కొమురంభీం పురిటి గడ్డ జోడేఘాట్‌ను సందర్శించారు. భీం విగ్రహానికి నివాళ్లు అర్పించి సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమురంభీం జిల్లాలో జోడే ఘాట్ ప్రాంతములో అమర వీరుడు కుమురంభీం స్మారక విగ్రహం, పర్యాటక కేంద్రం ఏర్పాటు చేయడం యావత్తు గిరిజన సమాజం గర్వించ దగ్గ విషయమని పేర్కొన్నారు. ఇక్కడి గిరిజనులకు గృహాలు నివాస యోగ్యంగా లేనందున ప్రభుత్వం శాశ్వత గృహాలు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణగౌడ్, సింగు వీరస్వామి, రవి, రాజా శేఖర్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

కాంట్రాక్టు కార్మికుల నూతన కమిటీని బుధవారం ఆర్‌కే ఓసీపీ గనిపై ఫిట్ సెక్రటరీ ఏ.ఆంజనేయులు అధ్యక్షతన కాంట్రాక్టు కార్మికుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎండీ అక్బర్ అలీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల హక్కుల సాధనకు పోరాడే యూనియన్ ఏఐటీయూసీ అన్నారు. అనంతరం రామకృష్ణాపూర్ కాంట్రాక్టు కార్మికుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇప్పకాయల లింగయ్య, ఉపాధ్యక్షుడిగా బోయపోతుల కొమురయ్య, సహ కార్యదర్శులుగా సతీష్, ముస్తఫా, జీలకర్ర మురళి, మహిళా కార్యదర్శి పి.రాజేశ్వరి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా జె.శ్రీనివాస్, సప్పిడి సాయి నేత్ర, ఏ.శ్రీనివాస్, ఎం.సుధాకర్, బత్తుల మొగిలి, కుర్ర ఓదెలు, ఎస్.శ్రీనివాస్, ఇ.ప్రభాకర్‌లను ఎన్నుకున్నారు. అలాగే కాంట్రాక్టు కార్మికుల హక్కుల కోసం ఈనెల 5వ తేదీ ఆదివారం రోజు భూపాలపల్లిలో జరిగే సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) 2వ మహాసభలకు కాంట్రాక్టు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని మహాసభను విజయవంతం చేయాల కోరారు. కార్యక్రమంలో ఆర్‌కే-1ఏ ఫిట్ సెక్రటరీ సురమళ్ళ వినయ్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ గోవిందుల రమేష్, ఆర్‌కే సీహెచ్‌పీ ఇన్‌ఛార్జి ఫిట్ సెక్రటరీ శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

4, 12న మహాసభను విజయవంతం చేయండి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ 4వ మహాసభలను మార్చి 4వ తేదీన, శ్రీరాంపూర్‌లో మార్చి12వ తేదీన నిర్వహించే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం కేంద్ర కార్యదర్శి మేకల దాసు పిలుపునిచ్చారు. శ్రీరాంపూర్ ఏరియాలో కాంట్రాక్ట్ కార్మికుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భూపాలపల్లిలో నిర్వహించే మహాసభకు సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కమిటీ ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. సుప్రీంకోర్టుకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండే అతిపెద్ద సంస్థ సింగరేణి అని కానీ కాంట్రాక్ట్ కార్మికుల వేతన అమలులో సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా కార్మికుల్ని ఆర్థికంగా నష్టం చేస్తుందని ఆరోపించారు. దేశం సుభిక్షంగా ఉందని అభివృద్ధి సాధించిందని అందమైన అబద్ధాలతో కాలం వెల్లదిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో దొడ్డిపట్ల రవీందర్, అశోక్, కొమురయ్య, వేణు, తిరుపతి పాల్గొన్నారు.

ఎస్‌విజి సహకార కళాశాలల వార్షికోత్సవం

నవతెలంగాణ-లక్ష్మణచాంద



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే గ్రామస్తులతో నడపబడుతున్న ఏకైక ఎస్‌విజి జూనియర్, డిగ్రీ కళాశాల వార్షికోత్సవ సంబురాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలలో విద్యార్థుల ఆటపాటలు అందరిని ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థుల శ్రేయస్సు కోసం నెలకొల్పిన కళాశాల ఉన్నతికి కృషి చేయాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు నారాయణ, ఉపాధ్యక్షులు ఈటెల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మహిపాల్, సర్పంచ్ ముత్యంరెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపాల్ నవిత, రవికిరణ్, రాజేశ్వర్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

బీసీల తరపున కాంగ్రెస్ పోరాటం చేయాలి



నవతెలంగాణ-జన్నారం

బీసీ కులాలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని బీసీల తరపున కాంగ్రెస్ పోరాటం చేయాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోకన్వీనర్ కాసెట్టి లక్ష్మణ్ అన్నారు. బుధవారం జన్నారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 75 సంవత్సరాల క్రితమే చట్టసభలైన అసెంబ్లీ, పార్లమెంట్లలో, బీసీ రిజర్వేషన్లు కల్పించవలసిన అగ్రవర్ణ కాంగ్రెస్ నాయకులు నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, లాల్ బహదూర్ శాస్త్రి లు, తమ అధికార బలంతో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించి, బీసీలకు అగ్రవర్ణ కులాలకు మధ్య రాజకీయం ఉండాలని దురుద్దేశంతో, బీసీ కులాల వారికి, రిజర్వేషన్ కల్పించకుండా రాజ్యాధికారం దక్కకుండా చేశారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి మన్మోహన్ సర్కారు వరకు ఇదే పద్ధతిని కొనసాగించి బీసీ కులాలకు రాజ్యాధికారం లేకుండా చేశాయిఅన్నారు. ప్రభుత్వాలపై తిరుగుబాటు చేయడానికి బీసీలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోకన్వీనర్లు కోదూరి చంద్రయ్య, కేఏ.నరసింహులు, మూల భాస్కర్ గౌడ్, శ్రీపాద రమేష్, ఆడెపు లక్ష్మీనారాయణ, కోడి జుట్టు రాజన్న, మామిడి విజయ్, కస్తూరి దుబ్బన్న పాల్గొన్నారు.

15న మంత్రి హరీష్‌రావు పర్యటన

నవతెలంగాణ-జైపూర్

రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు ఈ నెల 15న చెన్నూర్ నియోజకవర్గంలో పర్యటించనున్నట్టు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు అభివృద్ధి పనుల ప్రారంబోత్సవంతో పాటు శంకు స్థాపన చేయనున్నారన్నారు. మంత్రి పర్యటన సంధర్భంగా ఏర్పాటు చేయనున్న బహిరంగ సభకు ప్రజలు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు. 20 వేల మంది బహిరంగ సభకు తరలివచ్చే అవకాశం ఉన్నందున 25 వేల మందికి ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. మంత్రి పర్యటన సంధర్భంగా చెన్నూర్ పట్టణంతో పాటు భీమారం, జైపూర్ మండల కేంద్రాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. సభా వేదిక మీదుగా మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, అభయహస్తం నిధులు, తునికాకు కార్మికులకు సంబంధించి చెక్కులను మంత్రి చేతుల మీదుగా అందిచనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్ కలెక్టర్ బాదవత్ సంతోష్, అదనపు కలెక్టర్ మదుసూధన్ నాయక్,



అదనపు కలెక్టర్ రాహూల్, రామగుండం పోలీస్ కమీషనర్ రెమో రాజేశ్వరి, డీఆర్‌డీఓ శేషాద్రి, ఎఫ్‌డీఓ రమేశ్, మున్సిపల్ కమీషనర్ గంగాధర్, తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే, ఈఈ ఇరిగేషన్ స్వామి, ఈఈపీఆర్ ప్రకాష్, జైపూర్ ఏసీపీ నరేందర్ డీఎం ఆర్టీసీ సూపరిండెంట్లు అరవింద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి యాత్రపై రాళ్లు రువ్వటం హేయమైన చర్య

నవతెలంగాణ-జన్నారం



రాజకీయంగా రేవంత్‌రెడ్డిని ఎదుర్కొనే సత్తా లేక బీఆర్ఎస్ గుండాలు తను చేపట్టిన యాత్రపై రాళ్లు రువ్వటం హేయమైన చర్యల అని కాంగ్రెస్ ఆదిలాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెడ్మ బొజ్జు విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూపాలపల్లి జిల్లాలో హాత్ సే హాత్ జోడయాత్రలో ప్రసంగిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బిఆర్ఎస్ గుండాలు గుడ్లు, రాళ్లు విసరడం, ప్రతిపక్షాల గొంతు నొక్కే విధంగా గుండాగిరి చేయడం దారుణం అన్నారు. కోరి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపక్షాలకు మాట్లాడే మాట్లాడే అవకాశం ఇవ్వకపోవటం బీఆర్ఎస్ ప్రభుత్వం ద్వంద విదానాలకు నిదర్శనమని అన్నారు. భూపాలపల్లి జిల్లాలో గండ్ర వెంకటరమణ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో పుట్టి పెరిగ 'తల్లి పాలు తాగి రొమ్ము గుద్దినట్టు' బీఆర్ఎస్ పంచన చేరి కాంగ్రెస్ నాయకులపై దాడి చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. రాజకీయాన్ని రాజకీయంతోనే ఎదుర్కోవాలి, కానీ ఇలా దాడి చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. జోడోయాత్రకు వస్తున్న స్పందన చూసి బీఆర్ఎస్ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయఅన్నారు. తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు, బోర్లకుంట ప్రభుదాస్, ఫసీఉల్ల, మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి, ముత్యం రాజన్న, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మామిడిపల్లి ఇంద్రయ్య, సీనియర్ నాయకులు దాముఖ కరుణాకర్, మహమ్మద్ అజారుద్దీన్, బోడ రవి నాయక్, దూత రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు

నవతెలంగాణ-ఉట్నూర్



నియోజకవర్గం అభివృద్ధిలో తనదైన ముద్ర వేస్తూ ముందడుగులో ఉంచుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్‌పై చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదని ఎంపీపీ పంద్రా జైవంత్‌రావ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సీతారాం అన్నారు. బుధవారం ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గం గత పాలకుల హయాంలో అభివృద్ధిలో ఆమడ దూరంలో ఉందన్నారు. రేఖా నాయక్ ఎమ్మెల్యే అయిన వెంటనే గిరిజన గ్రామాలకు బీటీ రోడ్లు వంతెనలు ఏర్పాటు చేశారన్నారు. ఆస్తులు ఎమ్మెల్యే కాకముందే సంపాదించుకున్నవని తెలిపారు. అవినీతి, అక్రమాలకు పాల్పడితే ప్రజలు రెండోసారి ఎమ్మెల్యేగా ఎందుకు ఎన్నుకుంటారన్నారు. మరింత అభివద్ధి కాకుండా బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఆటంకం కల్పిస్తున్నారన్నారు. పూర్తి స్థాయిలో ఆధారాలు సేకరించి నిజానిర్ధారణ చేయాలని సవాల్ విసిరారు. సామాజికంగా సేవా కార్యక్రమాల్లో టీఎన్జీఓ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్యామ్ నాయక్ పాల్గొంటున్నారని, కావాలనే రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. రాజకీయంగా ఎదుర్కొనలేకనే ఎమ్మెల్యే రేఖా దంపతులపై పలువురు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లోనూ రేఖానాయక్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు అజిమోద్దీన్, పోషన్న, అన్సారీ, ఆశన్న, బాజీరావ్, ధర్మునాయక్, వెంకటేష్, లక్ష్మీపతి, స్వామి పాల్గొన్నారు.

4, 6న నైతిక విద్య, పర్యావరణ పరీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు 4, 6వ తేదీల్లో నైతిక విద్య, పర్యావరణ పరీక్షలు నిర్వహించనున్నట్టు జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ తెలిపారు. బుధవారం డీఐఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ రంగ, ప్రైవేట్ మొత్తం 47 కళాశాలల్లో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రథమ సం. జనరల్ 4369, ఒకేషనల్ 766 మొత్తం 5135 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారని, 60 మార్కులకు పరీక్ష, 40 మార్కులు ప్రాజెక్టులకు కేటాయించబడ్డాయన్నారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు అవార్డు లిస్టులను, ప్రశ్నాపత్రాలను, హాల్ టికెట్లను సకాలంలో డౌన్ లోడ్ చేసుకొని విద్యార్థులకు అన్ని రకాల సూచనలు చేస్తూ తగు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

కంటి వెలుగు శిబిరాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని స్థానిక 7వ వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిబిరానికి సంబంధించిన ఏర్పాట్లపై అధికారులను, ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంటి సమస్యలు పరిశీలించే పరికరాలను ఆయన స్వయంగా పరిశీలించారు. మున్సిపాలిటీలో ఇప్పటివరకు నిర్వహించిన కంటివెలుగు శిబిరాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్ల నిర్వహణ తదితర విషయాలపై చర్చించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కల్గకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ పొలం సత్యం, కౌన్సిలర్లు జాడి శ్రీనివాస్, పారుపల్లి తిరుపతి, యువ నాయకులు చంద్రకిరణ్ పాల్గొన్నారు.

కంటి వెలుగు లక్ష్యాన్ని పూర్తి చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజల కంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు రెండవ విడత కార్యక్రమం లక్ష్యాన్ని 100 శాతం పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ సహదేవరావు అన్నారు. బుధవారం జిల్లాలోని తిర్యాణి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంటి వెలుగు రెండవ విడత కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం 26 శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఇందుకోసం 26 బృందాలను నియమించి ప్రతి రోజు శిబిరాలకు హాజరయ్యే ప్రజలకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అవసరం ఉన్నవారికి రీడింగ్ గ్లాసులు అందించడం జరుగుతుందని, ప్రిస్క్రిప్షన్ అద్దాలు అవసరం ఉన్నవారికి ఆర్డర్ పై అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ప్రతి రోజు ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆశ్రమ పాఠశాల, గురుకుల బాలికల కళాశాల, కస్తూరిబా గాంధీ పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులకు సిలబస్ రివిజన్ చేసి పరీక్షలకు సన్నద్ధం చేయాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు. మండలంలోని తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని, అధికారులు సిబ్బంది తమకు కేటాయించిన విధులను ఎలాంటి అలసత్వం వహించకుండా సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. వివిధ రకాల సేవల కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలతో జవాబుతారీతనంతో వ్యవహరించాలన్నారు.

విధులు బహిష్కరించి నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వేతనాల సవరణ చేపట్టాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో డివిజనల్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నాలుగు రోజులుగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్నామని జేఏసీ చైర్మెన్ సుద్దాల శ్రీనివాస్ తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతోనే సమ్మెబాట పట్టినట్టు తెలిపారు. మార్చి 3, 4 తేదీల్లో ఎస్సీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని పేర్కొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-తలమడుగు

పల్లి-కే గ్రామంలో వాలీబాల్ పోటీలను జడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్‌రెడ్డి, ఎంపీటీసీ సోమన్న, ఉప సర్పంచ్ లక్ష్మణ్, గ్రామస్తులు రమేష్, భూమా ండ్డి, లింగారెడ్డి, జైహనుమాన్ యూత్ క్లబ్ అధ్యక్షులు ఆదిరెడ్డి పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మానవ సేవే మాధవ సేవ సమితి, బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీల ఆధ్వర్యంలో బుధవారం అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి శ్మశానవాటికలో బుధవారం సంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఫిబ్రవరి 25న రైల్వేస్టేషన్‌లో 70 సంవత్సరాల వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందింది. బంధువులు, కుటుంబ సభ్యులు ఎవరు లేనందున టూటౌన్ సీఐ పురుషోత్తం, ఎస్సై విష్ణు మానవ సేవే మాధవ సేవ సమితి సభ్యులకు అంత్యక్రియలు నిర్వహించాలని సమాచారం అందించారు. సమితి అధ్యక్షులు శ్రీనివాస్, సభ్యులు ఆధ్వర్యంలో అంత్యక్రియలు చేశారు.

జైజవాన్ జైకిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం



నవతెలంగాణ-కడెం

మండలంలోని పాండ్వపూర్ గ్రామానికి చెందిన పెద్ది సునీత-రమేష్ దంపతులకు ఏకైక కుమారుడు పెద్ది జస్వంత్(12) ఇటీవల బ్లడ్ క్యాన్సర్‌తో మృతి చెందడంతో జై జవాన్ జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. ఏడో తరగతి చదువుతున్న బాబును బతికించుకోవడానికి తల్లిదండ్రులు రూ.15 లక్షల వరకు ఖర్చు చేశారు. విషయం తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక సాయం అందజేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పాలకాని గంగాధర్, లింగన్న, రాజశేఖర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల పోస్టర్లు విడుదల



నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలోని అన్నాభావుసాటే విగ్రహం వద్ద బుధవారం తెలంగాణ ఉద్యమకారుడు పుప్పాల పీరాజి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఎన్నో ఉద్యమాలు చేశామన్నారు. ఉద్యమకారుల సంక్షేమానికి బోర్డు ఏర్పాటు చేసి రూ.10వేల కోట్లు కేటాయించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో 20శాతం ఉద్యమకారులకే కేటాయించాలని, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామకృష్ణగౌడ్. వి నగేష్, సూది రాజన్న, కల్యాణ పోశెట్టి, కాశీనాథ్, శివరాం పాల్గొన్నారు.

చెరువులో పడి జాలరి మృతి

నవతెలంగాణ-తాండూర్

తాండూరు గ్రామానికి చెందిన జాలరి కంపెల్ల బాపు(62) బుధవారం మృతి చెందినట్టు ఎస్సై సమ్మయ్య తెలిపారు. స్థానిక ద్వారకాపూర్ రాముని చెరువులో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు చేపల వల చుట్టుకొని మతి చెందినట్లు తెలిపారు. చెరువులో నీరు ఎక్కువగా ఉండటం వల్ల ప్రమాదవశాత్తు బాపు మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ప్రీతి మృతి కారకులను శిక్షించాలి



నవతెలంగాణ-కుభీర్

మెడికో ప్రీతి మృతికి కారకులైన వారిని వెంటనే శిక్షించాలని బుధవారం మండల కేంద్రంలో గోర్ సేన బంజారా సమాజ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద బైటాయించారు. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని విశ్వంబర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సుదాం రాథోడ్, గంగశేఖర్, పి.లింబాద్రి, ఏశాల దత్త్రాత్రి, అర్జున్, మల్లేష్, జాదవ్ పండిత్ పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణం కాపువాడలోని మున్నూరు కాపు సంఘం భవనంలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రాచకొండ గిరీష్‌కుమార్, స్థానిక కౌన్సిలర్ పిర్సింగుల జయచందర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల సౌకర్యార్థం ప్రత్యేకంగా కంటి వెలుగు శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు సౌమ్యతో పాటు వైద్య సిబ్బంది. కాలనీవాసులు పాల్గొన్నారు.

అత్యవసర సమయంలో బాలికకు రక్తదానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రక్తహీనతతో బాధపడుతున్న బేల మండలం పోనాల గ్రామానికి చెందిన బాలిక కుమ్ర రాణికి మహారాష్ట్రలోని ఝరి మండలం కమైల్లి గ్రామానికి చెందిన యువకుడు రాజు రక్తదానం చేశాడు. రక్తం అవసరముదని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రెటరీ సామ రూపేష్‌రెడ్డిని బాలిక కుటుంబ సభ్యులు సంప్రదించారు. ఆయన వెంటనే స్పందించి రక్తదాతను ఏర్పాటు చేశారు. దీంతో కుటుంబ సభ్యులు కుమ్ర లక్ష్మీబాయి, మాజీ జెడ్పీటీసీ రాందాస్, స్వామి రూపేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నార్నూర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రెండో విడత కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపిపి జాదవ్ చంద్రశేఖర్, గాదిగూడ వైస్ ఎంపిపి ఎం.యోగేష్ అన్నారు. బుధవారం మండలంలోని తాడిహత్నూర్, గాదిగూడ మండలంలోని మేడిగూడ గ్రామ పంచాయతీలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లపై బడిన ప్రతిఒక్కరూ కంటి వెలుగులో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మధుకర్ రాథోడ్, ఉపసర్పంచ్ విష్ణు, కార్యదర్శి శేఖర్, నాయకులు కోటగిరి విశాల్, శేషేరావ్, డా.సంజీవ్, స్నేహ, హెచ్‌ఈఓ రవీందర్, కైలాష్ పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణీ కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) మహాసభలను విజయవంతం చేయాలని ఆ యూనియన్ కార్యదర్శి సోమారం తిరుపతి ఉపాధ్యక్షుడు భయ మొగిళి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని గోలేటిలో కేఎల్ మహేంద్రభవనంలో ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన కాంట్రాక్టు వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభలకు కార్మికులు అధిక సంఖ్యంలో పాల్గొనాలని కోరారు. ముఖ్యంగా ఉద్యోగభద్రత, హైపర్ కమిటీ వేతనాలు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. గోలేటిలో ఖాళీగా ఉన్న క్వాటర్లను కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాలన్నారు. అనంతరం గోలేటి బ్రాంచ్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవధ్యక్షుడిగా భయ్య మొగిళి, ఇన్‌చార్జిగా బి.జగ్గయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాయల నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా చల్లూరి అశోక్, సహాయ కార్యదర్శులుగా ఎ.సాగర్‌గౌడ్, ధన్‌రాజ్, కోశాధికారిగా వేణు, కార్యవర్గ సభ్యులుగా సుధాకర్, బర్ల శేఖర్, చరణ్, బండి స్వామి, సమ్మయ్య, కిరణ్, దుర్గం శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో గోలేటి బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు బి.జగ్గయ్య, శేషు, మారం శ్రీనివాస్, కిరణ్‌బాబు, ఫిట్ కార్యదర్శులు దూపాక రాజేష్, కందుల మల్లేష్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం కేసులో పోలీసుల గోప్యం

- అరెస్టు చేసినా వివరాలు వెల్లడించని పోలీసులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని రాస్పెల్లి గ్రామపంచాయతీ గెర్రెగూడకు చెందిన ఓ యువతి ఈ నెల 25న అదృశ్యమైనట్టు కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. 26న సదరు యువతి ముగ్గురు యువకులతో కలిసి కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ దుకాణంలో సామాగ్రి కొనుగోలు చేస్తుండగా గెర్రెగూడ గ్రామానికి చెందిన ఓ యువకుడు గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు, తల్లితండ్రులతోపాటూ హుటాహుటిన కాగజ్‌నగర్ పట్టణంలో తిరుగుతున్న సదరు యువతితోపాటూ మరో ముగ్గురిని పట్టుకుని ఈజ్ గాం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. వీరిని విచారించిన పోలీసులకు కాగజ్‌నగర్ పట్టణంలో కొంతమంది అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టుగా తేలింది. కాగజ్‌నగర్ పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ముఠా వ్యవహారాన్ని చేధించిన పోలీసులు వివరాలు వెల్లడించలేదు. ప్రాథమిక విచారణలో ఏడుగురు పురుషులు. ముగ్గురు మహిళలు పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలు నడిపిస్తున్నట్లు తేలినప్పటికీ ఏమాత్రం బయటకు పొక్కకుండా అత్యంత గోప్యంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం నలుగు పురుషులను, ముగ్గరు మహిళలను ఈ కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయినప్పటికీ అరెస్టు వ్యవహారాన్ని అత్యంత గోప్యంగా ఉంచారు. ఈ కేసులో నిందితుల అరెస్టు విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచట పట్ల పలు అభిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేసులో ఉన్న నిందితులు ఎంతమంది...? ఏ నేరం కింద ఏ కేసు నమోదు చేశారనే విషయాలను చెప్పకుండా దాటవేశారు. విచారణ చేపట్టిన మొదటి రోజునింధితుల వివరాలను చెప్పకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈ విషయంపై కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజును వివరణ కోరగా వివరాలు వెల్లడించలేమని చెప్పడం గమనార్హం.

బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశం

నవతెలంగాణ-రెబ్బెన

ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని గతకొన్ని రోజులుగా నిర్వహిస్తున్న స్ట్రీట్ కార్నర్ సమావేశం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మొదటిదశ ముగింపు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ పార్లమెంటు సభ్యులు రాథోడ్ రమేష్, ప్రబారి రాజేందర్, ఆసిఫాబాద్ నియోజకవర్గ బీజేపీ కాన్స్‌టెంట్ ఎమ్మెల్యే క్యాండెట్ ఆజ్మెర ఆత్మారాం నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మొత్తం దోపిడి జరుగుతుందని, కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కొత్త హామీలు ఇస్తూ ప్రజలను మాయ చేస్తున్నారని, మోసం చేస్తూ మభ్యపెడుతున్నారు. తప్పా కేసీఆర్ 9 ఏండ్ల పరిపాలనలో తెలంగాణ రాష్ట్రంలో కార్మిక, కర్షక రైతులకు ఎటువంటి ప్రయోజనాలు చేకూర్చలేదని, తమ ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌లు ఆత్రం సక్కు, కోవలక్ష్మి అధికారులను బదిలీ చేయడంలో కమీషన్‌లు కాంట్రాక్టర్ల వద్ద నుండి కమీషన్‌లు, ల్యాండ్ మాఫియా, వైన్ మాఫియాలో బిజీగా ఉన్నారని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణకుమారి, పార్లమెంటు కోకన్వీనర్ కొలిపాక కిరణ్‌కుమార్, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి, సునీల్ చౌదరి, అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, మండలాధ్యక్షుడు గోలెం తిరుపతి, మల్లేష్, కనకయ్య సుధాకర్, నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

శనగ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సారంగాపూర్

రైతులు శనగ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిఎసిఎస్ చైర్మన్ నారాయణరెడ్డి, ఎఎంసి చైర్మన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో కౌట్ల(బి)సొసైటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన శనగలను మార్కెట్ యార్డుకు తెచ్చి విక్రయించాలన్నారు. క్వింటాల్‌కు రూ.5335 మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుజాత నర్సారెడ్డి, సిఈఓ సలీం కార్యదర్శి భూమన్న, నాయకులు మాధవ్‌రావు, మార్కెట్ కమిటీ,



సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా క్రీడాపోటీలు

నవతెలంగాణ-రెబ్బెన

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బెల్లంపల్లి ఏరియాలోని మాదారం, గోలేటి ఆఫీసర్స్ క్లబ్, గోలేటి సింగరేణి పాఠశాల మైదానంలో మహిళలకు పలు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్టు జీఎం జీఎం దేవేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు, అదేవిధంగా 5వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు గోలేటి టౌన్‌షిప్‌లోని జీటీసీఓఎ క్లబ్‌లో ఈ నెల 6వ తేదీన గోలేటి సింగరేణి పాఠశాల మైదానంలో సాయంత్రం నాలుగు గంటలకు పలు క్రీడాపోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళా దినోత్సవ ప్రధాన ఉత్సవం 8వ తేదీన సాయంత్రం ఆరు గంటల నుండి గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించబడుతుందన్నారు. మహిళలందరు ఆట, పాట, సాంస్కృతిక పోటీల్లో పాల్గొనేందుకు జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్టుమెంట్లలో పేర్లు నమోదుచేసుకోవాలన్నారు. ఆట, పాట, సాంస్కృతి పోటీల విజేతలకు ముఖ్య అతిథుల చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగల మహిళలు తమ పేర్లు నమోదు చేసుకోవలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిని అభినందించిన సార్ చిత్ర బృందం



నవతెలంగాణ-కెరమెరి

కెరమరి మండలం సావర్కేడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు,2021 సంవత్సర జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కడేర్ల రంగయ్య నిస్వార్థ సేవలకు మరొక ఘనమైన గుర్తింపు లభించింది. సితార ఎంటర్టైన్మెంట్స్ వారిచే నిర్మించబడి, ఫిబ్రవరి 17న విడుదలై అఖండ విజయాన్ని సాధించిన సార్ సినిమా చిత్రబృందం కడేర్ల రంగయ్యను సితార ఎంటర్టైన్మెంట్స్ కార్యాలయం మాదాపూర్ హైదరాబాద్‌కు ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా సార్ చిత్ర దర్శకుడు వెంకీ అట్లూరి, నిర్మాత నాగ వంశీ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుని సేవలను వారు కొనియాడారు. అనంతరం పేద విద్యార్థుల కోసం గ్రంథాలయాల ఏర్పాటుకు మూడు రూ.లక్షల విరాళం అందించి ఉదారతను చాటుకున్నారు. సార్ చిత్ర బృందం సబ్యులు విరాళం అందించిన విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు, అభినందించారు.

అంబేద్కర్ విగ్రహా ఏర్పాటుకు భూమి పూజ

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కోమటిచేను పంచాయతీలోని బస్టాండ్ సమీపంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు గ్రామస్తులు, నాయకులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవలను గుర్తు చేసుకున్నారు. విగ్రహం అందజేస్తున్న శ్యాంసుందరన్ను అభినందించారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు దుర్గం పోశం, సర్పంచ్ రాంటెంకి శ్రీనివాస్, ఎంపీటీసీ చంద్రమోళి, నాయకులు రాంటెంకి వాల్దేవ్, జాడి శంకర్, మాసు సుధాకర్, ఉప సర్పంచ్ సూర్య ప్రకాశ్, తిరుపతి, శంకర్, సాగర్ పాల్గొన్నారు.

గోలేటి నుంచి మంచిర్యాలకు బస్సు సౌకర్యం

నవతెలంగాణ-రెబ్బెన

ఏఐటీయూసీ పోరాటం ఫలితంగానే గోలేటి సింగరేణి కార్మికులకు ఉదయం, సాయంత్రం గోలేటి నుండి మంచిర్యాలకు బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. గతకొంత కాలం నుంచి సింగరేణి జీఎం కార్యాలయం ఉద్యోగులకు, గోలేటి ప్రజలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురయ్యారని, ఇట్టి విషయం బెల్లంపల్లి ఏరియా జీఎం దృష్టికి, ఆర్‌టీసీ రీజినల్ మేనేజర్ దృష్టికి, ఆసిఫాబాద్ డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. దీనిపై స్పందించిన అధికారులు గోలేటి నుండి మంచిర్యాలకు ఆర్‌టీసీ బస్సు పునరుద్దరించారన్నారు. కార్మిక హక్కులను ఏఐటీయూసీతోనే సాధ్యమన్నారు. కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ పోరాటం చేస్తుందన్నారు.

సింగరేణి కాంట్రాక్టు కార్మికుడిపై తేనెటీగల దాడి

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని బెల్లంపల్లి ఏరియా గోలేటి సింగరేణి సీహెచ్‌పీలో రైల్వే మెయిన్‌టెన్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు పెరుగు చంద్రయ్యపై బుధవారం పనిచేసే స్థలంలో తేనెటీగలు దాడిచేశాయి. గోలేటి సీహెచ్‌పీలో ట్రక్కు లోడింగ్ పియోపిన్ వద్ద పనిచేసే స్థలంలో ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. దీంతో కార్మికుడు చాలా గాయాలతో ఉండడం గమనించిన తోటి కార్మికులు గోలేటి డిస్‌పెన్సరీకి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ కేంద్రె కార్యదర్శి బోగె ఉపేందర్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్‌తో మాట్లాడి గాయాలపాలైన కార్మికుడికి సరైన వైద్యమందించాలని కోరారు. అనంతరం కేంద్ర కార్యదర్శి బోగె ఉపేందర్ మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం కార్మికులకు రక్షణ కల్పించడంలో గోరంగా విఫలమయ్యారన్నారు. సింగరేణి అధికారులకు బొగ్గు ఉత్పత్తి మీద ఉన్న శ్రద్ధ కార్మికుల సంక్షేమంపై లేదన్నారు.